విద్యుత్‌ సమస్యలపై అధికారుల పర్యటన

మేడ్చల్‌: పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పట్టణ విద్యుత్‌ అధికారులు శనివారం పట్టణంలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎల్లమ్మతోట, వీకర్‌సెక్షన్‌ తదితర కాలనీల్లో పర్యటించి వినియోగదారులను కలిసి వారు ఎదుర్కొంటున్న విద్యుత్‌ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ నుంచి ఎలాంటి సమస్య లేకుండా అన్ని సమస్యలు పరిష్కరించి ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్‌ సరఫరా చేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలున్నా.. అధికారులు, సిబ్బందికి వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. ఏడీఈ రాజమల్లేషం, ఏఈ రాంబాబు, లైన్‌మెన్‌ వినోద్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ పెంచాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్‌ నేతలు

మేడ్చల్‌: పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్‌ చేపట్టిన ఉద్యమంలో భాగంగా దివ్యాంగులు, వృద్ధులతో కలిసి మేడ్చల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ చంద్రప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వికలాంగులకు రూ.6 వేలు, కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15వేలు, వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళలకు రూ.4వేల పెన్షన్‌లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్‌ నాయకులు పరశురాం, బాలనర్సింహ్మా, రామకృష్ణ, మల్లేష్‌, శ్రీను, ధీరజ్‌ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కలకలం..

ఘట్‌కేసర్‌: పట్టణంలో శనివారం తెల్లవారు జామున చోరీ కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌ పురపాలక సంఘం పరిధిలోని శివారెడ్డిగూడలో ఫ్రెండ్స్‌ కార్‌ కేర్‌, మహేంద్ర టెక్స్‌టైల్‌ దుకాణాల్లో చోరీ చేసేందుకు ఓ వ్యక్తి యత్నించాడు. దుకాణం వెనుకభాగం నుంచి లోపలికి వెళ్లి పూజా సామగ్రితో పాటు ఇతర వస్తువులను దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. సదరు వ్యక్తికి సుమారు 30 ఏళ్ల ఉంటాయని, మాస్కు ధరించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డైంది. రూ.3 వేల విలువైన సామగ్రి చోరీ అయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాద బాధితులకు 108 సిబ్బంది వైద్యం

కీసర: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి 108 సిబ్బంది సకాలంలో స్పందించి అత్యవసర వైద్యం అందించారు. వివరాల ప్రకారం.. రాంపల్లికి చెందిన ఆంజనేయులు బైక్‌పై నాగారం వైపు వెళ్తుండగా.. ఇందిరమ్మ కాలనీలో నివసించే కుమార్‌ రాంపల్లి వైపు వస్తున్నాడు. రాంపల్లి లక్కీ వైన్స్‌ వద్ద వీరిద్దరి బైక్‌లు ఢీ కొట్టుకున్నాయి. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ, పైలట్‌ చిత్రం రవి, ప్రభాకర్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణం.. ప్రమాదం !

- ప్రమాదకరంగా రైలు ప్రయాణాలు
- రద్దీకనుగుణంగా కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని రైల్వే అధికారులు



ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణికులు (ఫైల్‌)

ఘట్‌కేసర్‌: ఒకప్పుడు కుగ్రామంగా ఉన్న ఘట్‌కేసర్‌ నేడు మున్సిపాలిటీ స్థాయికి ఎదిగింది. పెరిగిన జనాభాకనుగుణంగా అభివృద్ధి, రవాణా సౌకర్యం కల్పించడంలో పాలకులు, సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరానికి సమీపంలో ఉండటం, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తుండంతో పలు జిల్లాల నుంచి వలసలు పెరిగి జనాభా విపరీతంగా పెరిగిపోయింది. తక్కువ వ్యయంతో ప్రయాణించే ఈ అవకాశం రైల్వే ప్రయాణానికి ఉండటంతో మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా రైళ్లలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో రోజురోజుకు ప్రయాణికుల తాకిడి పెరిగి ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

◆ ప్రస్తుతం పుష్‌పుల్‌, మణుగూరు, కాచిగూడ-మిర్యాల్‌గూడ రైళ్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ నిలుపుతారు. వరంగల్‌, ఖాజీపేట్‌, భువనగిరి నుంచి వేలాది మంది ఉపాధి, చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు.

అడుగు వేయలేని దుస్థితి..

ఇక్కడి నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్య, వైద్యం కోసం విద్యార్థులు, సామాన్యులు ఇటు సికింద్రాబాద్‌ అటు వరంగల్‌ వైపు ప్రయాణిస్తుంటారు. ఉదయం, సాయత్రం వేళల్లో పుష్‌పుల్‌ రైలు సమయానికి ఉండటంతో చాలామంది ఇందులోనే ప్రయాణిస్తుంటారు.

ఫుట్‌బోర్డుపైనే ప్రయాణం..

వరంగల్‌, ఖాజీపేట నుంచి ఉదయం పుష్‌పుల్‌ రైల్లో అడుగు తీసి అడుగు వేయని పరిస్థితి ఉంది. పండుగ సమయాల్లో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. రైలు లోపల నిలబడే చోటులేక ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తుంటారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో రైళ్ల సంఖ్యను పెంచాలని రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి స్థానిక రైల్వే మరిన్ని ప్యాసింజర్‌ రైళ్ల నిలపాలని కోరుతున్నారు.

జనాభాకు అనుగుణంగా రైళ్లను పెంచాలి..



నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. స్థానికులే కాకుండా వరంగల్‌, ఖాజీపేట్‌, ఆలేరు, జనగాం నుంచి ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా ప్యాసింజర్‌ రైళ్లను పెంచాలి.

– రాంపల్లి జగదీష్‌గౌడ్‌, ఘట్‌కేసర్‌

అడుగు తీసి అడుగు వేయలేం..



ఉదయం నగరం వైపు, సాయంత్రం వేళ ఇంటికి వెళ్తుంటారు. ఆయా సమయంలో రైల్లో అడుగు తీసి అడుగు వేయలేని విధంగా ఉంటుంది. సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు విఫలమయ్యారు.

– సిరాజ్‌, స్థానికుడు

పేదలకు రవాణా సౌకర్యం కల్పించండి..



రైలు ప్రయాణం చౌకగా ఉండటంతో ఎక్కువ మంది పేదలే రాకపోకలు సాగిస్తుంటారు. పేదలకు రవాణా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– శరత్‌, స్థానికుడు

అగ్నిప్రమాదాల నివారణకు 'మాక్‌ ఫైర్‌ డ్రిల్‌'



కీసర: అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం రాంపల్లి జూబ్లిహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో చర్లపల్లి ఫైర్‌ స్టేషన్‌ ఆఫీసర్‌ కె. చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మాక్‌ ఫైర్‌ డ్రిల్‌ నిర్వహించారు . అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, విద్యార్థులు తమ చేతులను తల వెనక భాగంలో ఉంచి, భవనం నుంచి బయటకు ఎలా..? వెళ్లాలనే పలు జాగ్రత్తలను ప్రమాదాలను అరికట్టే విధానాలను ప్రత్యక్షంగా అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఎం. సంతోష్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఇలాంటి అభ్యాస కార్యక్రమాలను స్కూల్‌ ఆవరణలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్కూల్‌ హెచ్‌ఎం కె. సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నర్సయ్య తదితరులు

కీసర: 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజేంద్రనగర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి అందజేసిన వరి విత్తనాల పంటలను శనివారం శాస్త్రవేత్త డాక్టర్‌ ఈ నర్సయ్య, కీసర మండల వ్యవసాయాధికారి మాధవిలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు పండించిన ఈ విత్తనాలను గ్రామంలోని ఇతర రైతులకు ఇవ్వడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. రైతులు ఒకరి దగ్గర నుంచి మరొకరు విత్తనాలు ఇచ్చుకోగలిగితే పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. కీసర, చీర్యాల గ్రామాల్లోని రైతులు కందాడి రఘుపతిరెడ్డి, రామిడి సంతోష్‌రెడ్డి, జిన్నారం సత్తిరెడ్డి రైతుల పొలాలు సందర్శించారు. ఏఈఓ వందన, రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌ ధాన్యం కొనుగోళ్లకు 14 కేంద్రాలు



అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాట్లు చేయడంతో పాటు దానికి సంబంధించి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌ హాల్‌లో 'ధాన్యం సేకరణ'పై సంబంధిత జిల్లా అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్య సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్‌ మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని తూర్పారబట్టి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చైతన్యపరచాలని ఆదేశించారు. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో చర్చించి ఒక క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చూసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ మన జిల్లాలోని కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు ధాన్యాలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. రైస్‌ మిల్లుల యజమానులు సన్న ధాన్యం దిగుమతుల సమయంలో తగిన జాగ్రతలు పాటించాలన్నారు. రైస్‌ మిల్లుల వద్దకు వరి ధాన్యం తరలించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. రైతు విక్రయించిన ధాన్యానికి 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమచేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌ సుగుణ బాయి, జిల్లా కో-ఆపరేటివ్‌ అధికారి వెంకట్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా మార్కెటింగ్‌ అధికారి రియాజ్‌, మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహయాదవ్‌, సొసైటీ చైర్మన్లు మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధాన్యం సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్‌ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో 'కార్డియోబీట్‌- 2కె25'



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో అంతర్జాతీయ హృద్రోగ సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. శనివారం స్కూల్‌ ఆఫ్‌ అలైడ్‌ అండ్‌ హెల్త్‌కేర్‌ సైన్సెస్‌ ఆధ్వర్యంలో 'కార్డియోబీట్‌ 2కె25' పేరిట డోంట్‌ స్కిప్‌ ఏ బీట్‌ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హృద్రోగ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు. రెండ్రోజుల సదస్సులో ఈకో కార్డియోగ్రఫీ, ఎలక్ట్రోఫిజియాలజీ, హృదయ మార్పిడి చికిత్సలు వంటి అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో చర్చించారు. ఈ సందర్భంగా పలు ఆవిష్కరణలు చేశారు. మల్లారెడ్డి, నారాయణ ఆసుపత్రి హృద్రోగ విభాగాధిపతి కమల్‌ కుమార్‌ చావ్లా, కార్డియాలజిస్ట్‌ గురుప్రసాద్‌, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మేడ్చల్‌: ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్యాలు దోపీడీ, రైతులు దోపీడీ, సామంత వ్యతిరేక పోరాటం, తెలంగాణ అసలైన పోరాట యోధులు అనే అంశంపై ఎస్‌ఎఫ్‌ఐ. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. శనివారం మేడ్చల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు భగత్‌, శ్యామ్‌, నర్సింగ్‌రావు, రాకేష్‌, బాలకిరణ్‌, గణేష్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పనులు ప్రారంభించాలి

శామీర్‌ పేట్‌: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ ఇంటి పనులను వెంటనే చేపట్టాలని తూంకుంట మున్సిపల్‌ కమిషనర్‌ జ్యోతి అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటి శామీర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అర్హులైన నిజమైన పేదవారికే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రహజ్‌యాత్ర కమిటీ సభ్యుడు ముజుబుద్దీన్‌, మున్సిపల్‌ మేనేజర్‌ శ్రావణ్‌కుమార్‌, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షన్‌ హామీని అమలు చేయాలి

శామీర్‌పేట్‌: వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు పెంచుతామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం వాటిని నెరవేర్చకుండా నట్టేట ముంచిందని దండోరా కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎస్‌.వై. అశోక్‌ ఆరోపించారు. శనివారం తూంకుంట మున్సిపాలిటిలో వృద్ధులు, వికలాంగులతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం శామీర్‌పేట వార్డు కార్యాలయంలో అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు వృద్ధులు, వికలాంగులకు పెన్షన్‌ పెంపునకు వారి పక్షాన ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. హామీ మేరకు పెన్షన్లు పెంచే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి నిరసనలు, ధర్నాలు చేపడుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. నాయకులు శంకర్‌, శేఖర్‌, వృద్ధులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

లా సెక్రటరీని కలిసిన న్యాయవాదులు



లా సెక్రటరీ పాపిరెడ్డితో మేడ్చల్‌ న్యాయవాదులు

మేడ్చల్‌: కండ్లకోయలో మంజూరైన జిల్లా న్యాయసముదాయాల భవనాల నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర లా సెక్రటరీ పాపిరెడ్డిని మేడ్చల్‌ బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు కలిశారు. కండ్లకోయ భవనం కోసం శంకుస్థాపన చేయాలని, జిల్లా న్యాయస్థానాలకు వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయిస్తానని పాపిరెడ్డి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. బార్‌అసోసియేషన్‌ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌గోపాల్‌ తదితరులున్నారు.

'ఎమ్మార్‌సెట్‌'లో ఐడియా ల్యాబ్‌ ప్రారంభం



ఐడియా ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్‌ కళాశాలలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఐడియా ల్యాబ్‌ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ వాక మురళీమోహన్‌ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, డిజైన్‌ థింకింగ్‌, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేందుకు ల్యాబ్‌ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌ఈపీ-2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ఈ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐడియా ల్యాబ్‌ కో- ఆర్డినేటర్‌ మల్లికార్జునలింగం, సహాయక కో-ఆర్డినేటర్‌ గోపాలకృష్ణ, ల్యాబ్‌ టెక్‌ గురూస్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అత్వెల్లి పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు

బతుకమ్మ సంబురం.. దసరా వేడుక

మేడ్చల్‌ జోన్‌ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో శనివారం బతుకమ్మ పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేత బతుకమ్మలను తయారు చేయించి ఆటపాటలతో పాఠశాలల్లో సంబరాలు చేశారు. సోమవారం నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం కావడంతో ముందస్తు వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– మేడ్చల్‌ జోన్‌ బృందం



రాంపల్లి జూబ్లిహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో..



చౌదరిగూడలోని అక్షర స్కూల్‌లో..

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా !

ప్రభుత్వ భూముల్లో దర్జాగా వెంచర్లు

- రేకుల షెడ్లు, ప్రీకాస్ట్‌ వాల్స్‌తో ఆక్రమణలు
- స్పందించిన కలెక్టర్‌... కదిలిన రెవెన్యూ యంత్రాంగం



ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్‌ మనుచౌదరి

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో భూదందా యథేచ్ఛగా సాగుతోంది. చేను కంచె మేసేలా ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన అధికారులు ,రాజకీయ నాయకులు దళారులుగా అవతారమెత్తి అందినకాడికి దోచుకుంటూ.. కోట్లకు పడగలెత్తుతున్నారు. చిన్నపాటి స్థలంలో పేదలు గుడిసె వేసుకుంటే .. నానా హంగామా చేసి.. కూల్చేవరకు ఊరుకోనని అధికారులు.. ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ మేడ్చల్‌ జిల్లాలో 11,384 ఎకరాల అసైన్డ్‌ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా.. వాటికి రక్షణ లేకపోవటంతో కబ్జాకు గురవుతున్నాయి. శివారుల్లో చెరువులు, కుంటల బఫర్‌ జోన్లు, శిఖం భూముల్లో కూడా అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు వెలుస్తున్నా.. రెవెన్యూ యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు ఉన్నాయి.

శివారుల్లో భూఆక్రమణలు.. మచ్చుకు కొన్ని..

కొర్రెముల్‌లోని సర్వే నెం.739 నుంచి 749 వరకు 147 ఎకరాల్లో ఏకశిలానగర్‌ పేరుతో లే ఔట్‌ను 1985లో చేశారు. అందులోని 47 ఎకరాలను 2006లో వ్యవసాయ భూమిగా మార్చేసిన ఓ వ్యక్తి లే ఔట్‌ స్వరూపాన్నే మార్చారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే లే ఔట్‌లో రెండు బడా రియల్‌ ఎస్టేట్‌ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంత మేర కబ్జా చేశారని పేర్కొన్నారు.

◆ అల్వాల్‌ మండలం జొన్న బండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, దీంతో 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

◆ దేవరయాంజల్‌లోని శిఖం భూమిలో లారీలకు సంబంధించిన వేబ్రిడ్జ్‌ ఏర్పాటు చేస్తున్నారని, ఆ పనులు నిలిపేసి చెరువును కాపాడాలని సీతారామచంద్రస్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి హైడ్రాను కోరింది.

◆ అన్నోజిగూడలోని సర్వే నెంబర్లు 9,10లోని పదెకరాల లేఅవుట్లో ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కును ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

◆ అన్నోజిగూడ సర్వే నెంబర్‌ 14లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి విక్రయించగా.. రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి వదలేశారు.

◆ ముత్వెల్లిగూడలో ప్రధాన రోడ్డు స్థలాన్ని 9 అడుగులు ఆక్రమించి సెల్లార్‌తో పాటు భవన నిర్మాణం జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతంలో మరో 4 భవనాలు తూర్పు వైపున 10 అడుగుల వరకు ఉన్న రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ కాప్రా సర్కిల్‌ పరిధిలోని సర్వేనంబర్‌199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి చెందిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ప్లాట్లు చేసి ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షలకు విక్రయిస్తున్నారు.

◆ మల్లాపూర్‌ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వేనంబర్‌ 24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు భూకబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

చెరువులను వదలని అక్రమార్కులు

మేడ్చల్‌ జిల్లాలోని బోడుప్పల్‌ కార్పొరేషన్‌ పరిధిలోరా, చింతల చెరువుల్లోని బఫర్‌ జోన్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. అల్వాల్‌ మండలం యాప్రాల్‌లో బడాయికుంటను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఫీర్జాదిగూడలో పెద్దచెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు భూములు కూడా అక్రమణకు గురయ్యాయి. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, జవహర్‌నగర్‌, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్‌ మేడ్చల్‌, దుండిగల్‌, కొంపెల్లి, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాల పరిధిలోని ఉన్న పలు చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయి.

స్పందించిన కలెక్టర్‌

నగర శివారుల్లో ప్రభుత్వ భూముల అక్రమణలపై వెల్లువలా ఫిర్యాదులు అందుతుండటంతో జిల్లా కలెక్టర్‌ మనుచౌదరి స్పందించారు. శనివారం గాజులరామారంలో శనివారం పర్యటించిన కలెక్టర్‌ మనుచౌదరి స్థానికంగా 307 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లాలో అనేక చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురౌతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్‌ మనుచౌదరి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేయడంతో పాటు వాటిని కాపాడేందుకు ప్రహరీ నిర్మించాలని, అందుకుగాను పూర్తి వివరాలను పంపాలని సూచించారు.